క్లుప్తంగా

నిర్దిష్ట ధరలకే అమ్మకాలు జరపాలి

ఏవో శ్రీధర్‌రెడ్డి



ముప్పాళ్ళ: విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిర్దిష్ట ధరలకే అమ్మకాలు జరపాలని, అధిక ధరలకు అమ్మినట్లుగా గుర్తిస్తే లైసెన్స్ రద్దు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. మండల వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల డీలర్లు, యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏవో మాట్లాడుతూ దుకాణాల నిర్వాహకులు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. బిల్లు పుస్తకాలు, స్టాక్ బోర్డులు, లైసెన్స్‌లు దుకాణంలో అందరికీ కనిపించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ధరల పట్టిక, స్టాక్ వివరాలు తెలిపే పట్టిక ఉంచాలన్నారు. లైసెన్స్ లేని ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అమ్మరాదని చెప్పారు. ప్రతి కొనుగోలుకు సంబంధించిన బిల్లు రైతులకు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన తప్పిపోయిన బాలుడు



సత్తెనపల్లి: తప్పిపోయిన బాలుణ్ని పట్టణ పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలు ఇలా... పట్టణంలోని నాగన్నకుంట ఏరియాకు చెందిన ఆరు సంవత్సరాల బాలుడు అంగోతు షాస్వాంత్ మని గురువారం ఇంటి నుంచి తప్పిపోయాడు. గుంటూరు రోడ్డులోని గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువ సమీపంలో తిరుగుతూ ఉండటంతో పట్టణానికి చెందిన షేక్ సమ్మద్ గమనించి, వెంటనే 10వ సచివాలయం మహిళా పోలీసు ఎం.తిరుముల లక్ష్మి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె సహాయంతో బాలుణ్ని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేర్చారు. తల్లిదండ్రుల సమాచారం తెలుసుకొని పట్టణ సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ ప్రారంభం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు 65 సంవత్సరాలు నిండిన కార్డుదారులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ కే నగేష్ గురువారం ప్రారంభించారు. 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కార్డుదారులకు సరుకులు అందించటం జరుగుతుందన్నారు. మండలంలో 1,850 మంది కార్డుదారులు ఉన్నట్లుగా గుర్తించామని, అందరికీ రేషన్ సరుకులు ఇంటి వద్దకే వెళ్లి అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, వీఆర్వో రస్కిన్, మాబువలి, సిబ్బంది పాల్గొన్నారు.

వారాహి నవరాత్రులు ప్రారంభం



సత్తెనపల్లి: పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో గురువారం భక్తిశ్రద్ధలతో వారాహి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. దుర్గామాతను వారాహి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామీజీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఫిరోజి రుషీంద్రుల మఠంలోని పంచముఖీ వేద గాయత్రి అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. పంచముఖీ వేద గాయత్రి అమ్మవారిని వారాహి అమ్మవారిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

విధుల్లో చేరిన పశు వైద్యులు

క్రోసూరు: మండలంలోని క్రోసూరు, దొడ్లేరు క్లస్టర్ల పశు వైద్యశాలలకు సంబంధించి ఇద్దరు పశు వైద్యులు గురువారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా వారు ఇక్కడకు వచ్చారు. క్రోసూరు క్లస్టర్ పశు వైద్యశాలకు రెంటచింతల నుంచి డాక్టర్ షేక్ బషీర్, అదేవిధంగా దొడ్లేరు క్లస్టర్ పశు వైద్యశాలకు తెనాలి నుంచి డాక్టర్ కె.రవికిరణ్ వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 10 వరకు మండలంలో జీవాలకు నట్టల నివారణ వ్యాక్సిన్లు ఇస్తున్నట్లు తెలిపారు. జీవాల పోషకులు నట్టల నివారణ వ్యాక్సిన్లు వేయించాలని కోరారు.

యువత మత్తుకు బానిసైతే జీవితం బుగ్గిపాలు

పలు చోట్ల మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు

సత్తెనపల్లి: యువత మత్తుకు బానిసైతే జీవితం బుగ్గిపాలవుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సీఐ పి.విజయ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల సమీపంలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి ఎస్‌ఐ కె.నాగలక్ష్మి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను విడనాడి ప్రశాంతమైన జీవితం సాగించాలన్నారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ డ్రగ్స్ వలన శరీరం, ఆరోగ్యం సర్వనాశనం అవుతాయని, అవయవాలు డ్రగ్స్ ప్రభావానికి లోనై చిన్న వయసులోనే మృత్యువాత పడతారని హెచ్చరించారు. మాజీ ఏపీపీ బగ్గి నరసింహారావు, లయోలా కళాశాల మేనేజ్మెంట్ ఎల్.అజయ్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా మద్యపానానికి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో...

ఉజ్వల భవిష్యత్తు కోసం యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సత్తెనపల్లి టౌన్ సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటే వారి జీవితాలు బంగారుమయం అవుతాయన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి ఐదు లాంతర్ల సెంటర్‌లో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ పీ పవన్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు, అంగన్‌వాడీలు, మహిళలు తదితరులు ఉన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: యువత మత్తుపదార్థాలు, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వేణుగోపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి మత్తు పదార్థాల పట్ల అవగాహన కల్పించేందుకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎస్‌ఐ వేణుగోపాల్, ఎంఈవో బి.మల్లిఖార్జునశర్మ, వివిధ శాఖల అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. రాజుపాలెం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్‌ఐ వేణుగోపాల్ మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడితే యువత భవిషత్ నాశనం అవుతుందని తెలిపారు. మత్తు పదార్థాలు రవాణా చేసిన, అమ్మిన కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న టౌన్ సీఐ నాగమల్లేశ్వరరావు



నకరికల్లులోని ర్యాలీలో సీడీపీఓ శ్రీలత, తహసీల్దార్ పుల్లారావు, ఐసీడీఎస్, అధికారులు

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ముప్పాళ్ళలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలను వివరించే ప్లకార్డులతో ఎంపీడీవో కార్యాలయం నుంచి ముప్పాళ్ళ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దార్ కే నగేష్, ఎంపీడీవో పీ రత్నం, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఏఎస్సై నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు: సమాజంలో డ్రగ్స్‌ను రూపుమాపడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం రూపుదిద్దుకుంటుందని సీడీపీఓ టి.శ్రీలత అన్నారు. మాదకద్రవ్యాల నివారణలో భాగంగా ఐసీడీఎస్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ, మానవహారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబాలను ఆర్థికంగా, ఆరోగ్య పరంగా ఛిన్నాభిన్నం చేసే మాదకద్రవ్యాలను విడనాడాలన్నారు. డ్రగ్స్ కలిగి ఉన్నా, క్రయవిక్రయాలు జరిపినా చట్టరీత్యా నేరమని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.పుల్లారావు, ఏసీడీపీఓ టి.సంతోషకుమారి, డిప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి, ఏపీఓ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సూపర్‌వైజర్స్ షేక్.రమీజున్, జె.నాగమణి, ఆనందకుమారి, ఆర్ఐ సిద్దయ్య, వీఆర్వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: మత్తు పదార్థాల వినియోగం వలన మానవ శరీరంలోని అన్ని వ్యవస్థలు దెబ్బతింటాయని పెదకూరపాడు ఎక్సైజ్ సీఐ వి.శ్రీనివాసులు తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం పెదకూరపాడులోని కాకతీయ జూనియర్ కాలేజిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల అవయవాలు పనిచేయక రోగ గ్రస్తులవుతారన్నారు. ఉద్రేకాలు, కోపం, అసహనం వంటి మానసిక రుగ్మతలకు దారితీస్తాయన్నారు. మత్తు పదార్థాలు ప్రాణాంతకం, మద్యం వద్దు, ఆరోగ్యం ముద్దు, ఆల్కహాల్ ఆరోగ్యానికి హానికరం వంటి నినాదాలు చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ డి.పీరుహుస్సేన్, కాలేజి మేనేజ్‌మెంట్ అశోక్‌బాబు, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మద్యం, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎంపీడీవో సునీత తెలిపారు. గురువారం మండల కేంద్రమైన బెల్లంకొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో 'యాంటీ డ్రగ్స్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ వరకు వివిధ శాఖల అధికారులు, పోలీసులు సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు జీవితాలు ఛిన్నాభిన్నం చేస్తాయని అన్నారు. ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ సరదాగా మొదలైన అలవాటు వ్యసనంగా మారడంతో ఎంతోమంది భవిష్యత్తును కోల్పోయారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శారదాదేవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ లక్ష్మీ సులోచన, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: మత్తు పదార్థాలు, డ్రగ్స్ వలన జీవితం అంధకారమవుతుందని, కుటుంబాలు చెల్లాచెదురవుతాయని తహసీల్దారు ఎం.సరోజ తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవంలో భాగంగా మండల కేంద్రమైన అచ్చంపేటలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడారు. డ్రగ్స్, మద్యం లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా యువత వాటికి బానిసలై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, సీఐ శ్రీనివాసరావు, సర్పంచ్ జాని, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజుపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్‌ఐ, అధికారులు తదితరులు



సత్తెనపల్లి లయోలా కళాశాలలో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్



ముప్పాళ్ళలోని అవగాహన ర్యాలీలో తహసీల్దార్ నగేష్, ఎంపీడీవో రత్నం, అధికారులు



బెల్లంకొండలో డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీలో అధికారులు, విద్యార్థులు



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది

క్రోసూరులో...

క్రోసూరు: విద్యార్థులు, ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వలన జీవితాలు దుర్భరమవుతాయని, వాటిని ఎక్కడ విక్రయించినా, రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలని క్రోసూరు ఎక్సైజ్ సీఐ టి.తులసి అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తోటి స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ వలన ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవీ, అధ్యాపకులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద...

ఎంపీడీవో, రెవెన్యూ, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని క్రోసూరు పురవీధుల్లో క్రోసూరు మండల పరిషత్ కార్యాలయం అధికారులు, రెవెన్యూ అధికారులు, పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్, తహసీల్దార్ నాగరాజు, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు, పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్యవిస్తరణ అధికారి శిఖాశ్యాంసన్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్, మద్యంతో కుటుంబాలు బలవుతాయ్

సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

అమరావతి(అచ్చంపేట): డ్రగ్స్, మద్యంతో కుటుంబాలు బలవుతాయని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణా దినోత్సవంలో భాగంగా అమరావతిలోని సత్తెనపల్లి జంక్షన్ నుంచి క్రోసూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. యువకులు, విద్యార్థులచేత అమరావతి సెంటర్‌లో ప్రతిజ్ఞ చేయించారు.. ప్లకార్డులు చేతబట్టి మత్తు పదార్థాలు హానికరం, మద్యం వద్దు–ఆరోగ్యమే ముద్దు, ఆల్కహాల్ ఆరోగ్యానికి ప్రమాదకరం అంటూ నినాదాలు చేశారు. డ్రగ్స్, మద్యానికి యువత దూరంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. వాటికి అలవాటుపడి బంగారం లాంటి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, రెవెన్యూ, పంచాపయతీరాజ్, పోలీస్ శాఖాధికారులు పాల్గొన్నారు.



అమరావతి సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, యువకులు

గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి

సత్తెనపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గొర్రెలు, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని కొమెరపూడి పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.పుల్లారెడ్డి అన్నారు.

సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో గురువారం గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ నాయకుడు యర్రా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 500 గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది హుస్సేన్, నవ్య, షామినా, సాగర్, గొర్రెలు, మేకల పెంపకందారులు తదితరులు ఉన్నారు.

నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ప్రతి నాయకుడు, కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య పాలన జరుగుతుందని, ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామన్నారు. దేశమైనా, రాష్ట్రమైనా రాజధాని ఉంటేనే అన్ని రంగాల అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందన్నారు. వచ్చే నాలుగు సంవత్సరాలలో సత్తెనపల్లి రూపురేఖలు మారుస్తామని, అభివృద్ధికి చిరునామాగా నియోజకవర్గాన్ని నిలుపుతామన్నారు. నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ, మండల అనుబంధ కమిటీలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు తాత జయప్రకాష్ నారాయణ, పరిశీలకులు కనుమూరి అనంతలక్ష్మి, సాతులూరి కుమార్, మద్దూరి వీరారెడ్డి, మన్నన్ షేక్ షరీఫ్, అక్కిపల్లి బాలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

ఫ్లోరోసిస్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి

గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్‌కుమార్

సత్తెనపల్లి: ఫ్లోరోసిస్‌పై విద్యార్థి దశ నుంచే పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లి మండలం కో లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పణిదం) పరిధిలోని నందిగం–1 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరంలో జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బోర్‌వెల్‌లోని తాగునీరు, పొగాకు సంబంధిత వస్తువులు, బ్లాక్ సాల్ట్, బ్లాక్ టీ వంటివి మితిమీరి ఉపయోగిస్తే ప్రజలు త్వరగా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారన్నారు. పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో కమ్యూనిటీ సర్వే కూడా చేయాలన్నారు. నివారణలో భాగంగా రక్షిత తాగు నీరు, కాల్షియం, విటమిన్–ఈ, విటమిన్–సీ అధికంగా ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు. ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణపై గ్రామ స్థాయిలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు, మండల స్థాయి సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. ఫ్లోరోసిస్ ఏ విధంగా వ్యాపిస్తుందో, దానిని ఏ విధంగా నివారించాలో తెలియచేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పీ గౌతమి, ఆరోగ్య విస్తరణాధికారి పీ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓ ఏ గణేష్, ఆరోగ్య కార్యకర్త డీ జ్యోతి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చార్టు ద్వారా అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గిరిధర్‌కుమార్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు



నకరికల్లు: ప్రభుత్వ గుర్తింపు పొందిన అధీకృత డీలర్‌ల వద్దే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని ఏవో కె.దేవదాసు రైతులకు సూచించారు. స్థానిక ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలలో గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లు, సోర్స్ ఆఫ్ సప్లై రశీదు పుస్తకాలు తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరిశీలించారు. రైతులకు విక్రయించే విత్తనాలను డీలర్‌లు ఎక్కడ నుంచి సేకరిస్తున్నారన్న విషయాన్ని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్రయ రశీదులపై పంట రకం, లాట్‌నంబరు, అమ్మకందారుని, కొనుగోలుదారుని సంతకం ఉండాలన్నారు. అధిక ధరలకు, నాణ్యతలేని, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండురకాల విత్తన నమూనాలను సేకరించి నాణ్యతా ప్రమాణాల తనిఖీ కోసం ల్యాబ్‌కు పంపామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్.సుభాని, సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్లేరు సీజీజీబీ ఎదుట బాధిత రైతుల ధర్నా

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గోదావరి చైతన్య గ్రామీణ (సీజీజీబీ)బ్యాంకులో తనఖా పెట్టిన బంగారు ఆభరణాల గోల్‌మాల్ బాధితుల సమస్యను వెంటనే పరిష్కారించాలని ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో దొడ్లేరు బ్యాంక్ ఎదుట గురువారం బాధిత రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ దొడ్లేరు సీజీజీబీలో జరిగిన బంగారం అవకతవకలపై రెండు సంవత్సరాల నుంచి ఆందోళన చేస్తున్నప్పటికీ నేటికీ సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇది అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు. దాదాపు 22 నెలల నుంచి రైతులు ఆందోళన చేస్తున్నప్పటికీ, బ్యాంకు అధికారులు, పోలీసులు సమస్యను పరిష్కరించలేదని అన్నారు. ఇంకా దాదాపు 130 మంది ఖాతాదారుల సమస్యను పరిష్కరించాల్సి ఉందని అందుకు సంబంధించి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో రైతులు శాంతియుతంగా ధర్నా చేపట్టడం జరిగిందన్నారు. అధికారులు సమస్యను పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. కౌలు రైతు సంఘం మండల కమిటీ సభ్యుడు లక్ష్మయ్య, బాధిత రైతులు పాల్గొన్నారు.



సీజీజీబీ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

సరస్వతీ శిశు మందిరాలు సంస్కార కేంద్రాలు

అమరావతి(అచ్చంపేట): సరస్వతీ శిశు విద్యా మందిరాలు గొప్ప సంస్కార కేంద్రాలని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు మంచి పౌరులుగా, గొప్ప సంస్కారవంతులుగా ఎదుగుతారని అమరలింగేశ్వరస్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.రేఖ అన్నారు. స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్ పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 24 వేలకు పైగా శిశుమందిరాలు ఉన్నాయన్నారు. ఇది మన దేశానికి ఎంతో గర్వకారణంగా చెప్పుకోవాలన్నారు. విద్యార్థులను మంచి క్రమశిక్షణతో భావిభారత పౌరులుగా తీర్చి దిద్దుతున్న పాఠశాల నిర్వాహకులను ఆమె అభినందించారు. పాఠశాల యాజమాన్యం ఆమెను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు పులిపాటి వెంకట పవన్‌కుమార్, కార్యదర్శి కౌశికప్రసాద్, కాకాని జనార్ధన్, హెచ్‌ఎం కోలా వెంకటేశ్వరరావు, గాజుల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ కమిషనర్‌కు జ్ఞాపిక అందచేస్తున్న పాఠశాల యాజమాన్యం

మొరాయించిన బస్సు.. నిలిచిన వాహనాలు



సత్తెనపల్లి: ఏపీఎస్ ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు(ఏపీ07జెడ్ 0082) అర్ధాంతరంగా పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్ సమీపంలో గుంటూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం నిలిచిపోయింది. అచ్చంపేట మండలం కోనూరు, కస్తల నుంచి 10 మంది ప్రయాణికులను ఎక్కించుకుని వస్తున్న బస్సు మధ్యలో మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులను మరో బస్సు ఎక్కించారు. పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్ సమీపంలోకి బస్సు రాగానే పూర్తి మొరాయించింది. క్లచ్ దిగిపోయి ఆయిల్ కారిపోతుండటంతో డ్రైవర్ ఆర్టీసీ గ్యారేజ్ సిబ్బందికి తెలియజేయడంతో హుటాహుటిన వారు చేరుకొని బస్సును గ్యారేజీకి తరలించారు. జాతీయ రహదారిపై బస్సు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగి కొద్ది సేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.